# మొదటి పాఠం!

శ్రీమతి లక్ష్మిగిరిబాబు



మా కారు డ్రైవరు నా సూటు కేసు తీసుకొచ్చి బస్సులో పెట్టాడు. బస్సంతా రద్దీగా వుంది, లేడీస్ సీట్లలో మూడవ సీటులో కూర్చున్న యిద్దరు మొగవాళ్లని కండక్టర్ చేత లేపించాడు మా డ్రయివర్. నేను వెళ్లి కిటికీ ప్రక్కన సీట్లో కూర్చుని, డ్రయివర్‌ని యింటికి వెళ్లమన్నాను. రెండు నిమిషాలలో బస్సు బయలు దేరింది. ఆకాశమంతా మబ్బులతో నిండిపోవటం వల్ల వాతావరణం చల్లగా వుంది. బస్సు వెళ్తోంటే కిటికీ లోంచి చల్లటి గాలి వచ్చి హాయిగా తాకుతోంది. రోడ్డు పక్కనున్న పచ్చటి పొలాలు ఆ చక్కటి వాతావరణానికి ఆనందంతో తలలూపుతున్నాయి. నా మనసులాగే ప్రకృతి కూడా చాల సంతోషంగా వున్నట్లనిపించింది.

బస్సు గమ్యం కేసి పరిగెత్తుతోంటే, నేను నా ఆశయాలకి దగ్గరగా పరిగెత్తుతున్నంత సంతోషం వేసింది. మరో మూడు గంటల్లో బస్సు కావలి చేరుకొంటుంది నా కోసం బెనర్జీ అంకుల్ బస్టాండ్‌కే వస్తారు. బెనర్జీ అంకుల్ కావలిలో బాగా పేరున్న లాయర్. అలాంటి గొప్ప లాయర్ దగ్గర జూనియర్‌గా వుండే అవకాశం రావడం నిజంగా నా అదృష్టం. నేను 'లా' ఫస్టు క్లాసులో పాసయ్యానని తెలియగానే బెనర్జీ అంకుల్ నన్ను తన దగ్గరకు పంపమని డాడీకి లెటర్ రాశారు ఏవరో ముక్కూ, ముఖం తెలియని లాయర్ దగ్గర పని చేసేకంటే, నాకు బాగా చనువున్న బెనర్జీ అంకుల్ లాంటి గొప్ప లాయర్ దగ్గర జూనియర్‌గా వుంటే నేను వింతయినా లాయర్‌గా అనుభవం సంపాదించుకోవచ్చు ఆడపిల్లలు లేని బెనర్జీ అంకుల్ నన్ను తన సొంత కూతురిలాగా ఆప్యాయంగా 'బేబీ' అనడం అలవాటు.

కావలి నాకు కొత్త వూరేమీ కాదు. అంతకుముందు డాడీతో కలిసి చాలసార్లు ఆ వూరికి బెనర్జీ అంకుల్ యింటికి వెళ్ళాను. 'లా' హైదరాబాద్‌లో చదివాను. లాయర్‌గా కావలిలో గుర్తింపు తెచ్చుకోవాలి అప్పుడే నా ఆశయాల్ని సాధించే శక్తి నాకు వస్తుంది. గుండెల నిండా తృప్తిగా గాలి పీల్చుకున్నాను.

న్యాయవాది అంటే అన్యాయవాది కాదని నిరూపించాలి. డబ్బు కోసం తప్పుడు కేసులు తీసికోకూడదు న్యాయం వున్నప్పుడే కేసు 'టేకప్' చెయ్యాలి ఫీజు కోసం ఆశపడి, నిర్దోషులని దోషులుగా తమ నైపుణ్యంతో నిరూపించే లాయర్లను చాలమందిని చూశాను. కాని, అది ఎంత అన్యాయమో, పాపమో వాళ్ళకి తెలియదా? అలాంటి లాయర్లను ఏం చేసినా పాపం లేదు నా దృష్టిలో... నాకు వెంటనే అరుణ, రాధ గుర్తుకొచ్చారు. వాళ్ళు నాలాగే 'లా' పాసయ్యారు. అన్యాయాన్ని న్యాయంగా నిరూపించడమే చాల గొప్ప అంటుంది అరుణ. న్యాయవాద వృత్తిలో న్యాయం, అన్యాయం అని మడి కట్టుకొని కూర్చుంటే లాభం లేదంటుంది రాధ. వాళ్ళకి నా ఆదర్శాలు, ఆశయాలు పరిహాసంగా అనిపిస్తాయి. వాళ్ళతో వాదించేప్పుడు నా ముఖం కందగడ్డలా మారిపోతుంది. నా ఆశయాల్ని సాధించి చూపిస్తానని రోజుకి పదిసార్లయినా వాళ్ల ముందు ఆవేశంతో చెబుతుంటాను. డాక్టర్‌గా డాడీ సంపాదిస్తున్నది కొన్ని లక్షల కుంది. అందువల్ల, నాకు డబ్బు గురించి

భయం అవసరం లేదు. లాయర్‌గా మోసా లతో సంపాదించవలసిన అవసరం అంతకన్నా లేదు. అందుకే – నిజమైన న్యాయవాదిగా నేను పేరు తెచ్చుకోవాలి కోర్టులు అందు బాటులో లేని నిర్దోషులైన పేదవాళ్ల తర ఫున వుచితంగా నయినా వాదించి వాళ్ళకి న్యాయం అందివ్వాలి. అంతకంటె నాకు జీవి తంలో ఏం కావాలి...

బస్సు ఏదో వూళ్లో ఆగడంతో నేను ఆలోచనల్లోంచి బయటపడ్డాను. కొంతమంది దిగారు. చాలామంది ఎక్కుతున్నారు. ఖాళీ అయిన సీట్లన్నీ నిండి పోయాయి. తర్వాత ఒక పెద్దమనిషి ఎక్కాడు. ఆయన్ని చూడ గానే పెదమనిషి అనిపిస్తున్నాడు. తెల్లటి పంచె. తెల్లచొక్కా, పైన కండువా, తెల్లగా పండిన తల, గంభీరంగా వున్న ముఖం— దాదాపు అరవై సంవత్సరాలుంటాయి ఆయ నకి. బస్సంతా నిండిపోవడం వల్ల ఆయనకి సీటు లేదు. నా పక్కన మాత్రం యిద్దరు కూర్చునే స్థలం వుంది. అయినా, అంతకు ముందు యిద్దరు కుర్రాళ్ళు అది చూసి కూడా, నా పక్కన కూర్చునే ధైర్యం లేక నిలబడ్డారు. అయితే, ఆ పెద్దమనిషి మాత్రం తన భుజం మీది కండువా సీటు మీద నా పక్కన వేసి చివరగా కూర్చు న్నాడు. మా డాడీ కన్నా సుమారు పదిహే నేళ్ళు పెద్దగా వున్న ఆయన నా పక్కన కూర్చున్నా తప్పులేదు. అయినా, మధ్యని కండువా వేసి కూర్చున్నాడంటే అతను ఎంత మంచివాడో అనిపించింది. అసలు ఆయన్ని చూడగానే ఎవరికైనా మంచి భావం కలుగు తుంది.

బస్సు కదలబోతుండగా ఒకతను కంగా రుగా వచ్చి, "అయ్యయ్యో, బస్సు కాస్త ఆపండయ్యో" అన్నాడు.

డ్రైవర్ బస్సు ఆపాడు.

"ఏ వూరు పోవాలి?" అడుగుతున్నాడు కండక్టరు.

"కావలికి పొయ్యేవాళ్లెవరన్నా వున్నా రయ్యా బస్సులో?" అనడుగుతున్నాడతను కిందనుంచే కంగారుగా.

"అదంతా నీ కెందుకయ్యా, నువ్వు ఎక్కుతావా లేదా చెప్పు, టైమయిపోతుంది. పోవాల" అంటున్నాడు కండక్టరు.

"అయ్యయ్యొ, అట్టనబాకయ్యా, కావలిలో దిగేవాళ్లెవరన్నా వుంటే వాళ్ళతో ఈ సంచి పంపాలయ్యా. కడుపుతో వున్న నా కూతుంక వళ్ళు, అరిసెలు పంపుతున్నానయ్యా" అంటున్నాడతను బతిమాలుతున్నట్లు.

"నీ కూతురింటికి పోయి ఎవరిస్తా రయ్యా, పోపోపో" విసుక్కున్నాడు కండక్టర్.

"బాబ్బాబు, బస్టాండు గేటుకానుకొనున్న సిగిరెట్టు కొట్లో యిస్తే చాలయ్యా, అది మా అల్లుడి కొట్టు. బాబ్బాబు, నేను పేదోడిని. కావలికి పోయి రావాలంటే చార్జీ అవుద్దయ్యా...." ఇంకా ఏదో చెబుతున్నాడు.

ఇంతలో బస్సులో చలనం వచ్చింది.

"పోనీ లేవయ్యా, కండక్టరూ, ఏదో కడుపుతో వున్న అమ్మాయి అంటున్నాడు. ఆ మాత్రం మనిషికి మనిషి సాయం చెయ్యక పోతే ఎట్టా?" అన్నారు కొంతమంది.

దాంతో కండక్టరు మెత్తబడ్డాడు.

బస్సు కింద నిలబడి మాట్లాడుతున్న ఆ మనిషి ధైర్యంగా బస్సు లోపలికి వచ్చాడు. ఆ మనిషిని చూస్తే నా కెందుకో మంచి అభిప్రాయంగాని సానుభూతి కాని కలగలేదు. 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్' అన్నది కరెక్టని నా వుద్దేశ్యం నాకు చిన్నప్పటి నుంచీ కనిపించిన ప్రతివాళ్ల ముఖాలూ చదివి ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం అలవాటు. అయితే, నా అంచనాలు తప్పయిన సందర్భాలు కూడా చాలా వున్నాయి.

"ఎక్కడియ్యాలో చెప్పయ్యా నే నిస్తా. నాది కావలేలే." అన్నాడు ఒకాయన లేచి నిలబడి. అతను మాసిపోయిన పంచె, బట్టలు [illegible] నున్నాడు. దేశంలోని పేదరికమంతా అతని లోనే వున్నట్టుంది.


అయితే, ఆ వచ్చిన మనిషికి ఆ పేద వాడికి తన పని అప్పగించడం యిష్టం లేన ట్టుంది. ఇబ్బందిగా ముఖంపెట్టి, "ఇంకె వ్వరూ కావలికి పొయ్యేవాళ్ళు లేరా?" అనడి గాడు.

కండక్టర్ నా పక్కనున్న పెద్ద మనిషిని చూపించాడు త్వరగా కానివ్వమన్నట్టు.

ఆ పెద్ద మనిషిని చూస్తూనే అతను సంతోషంగా దగ్గరకు వచ్చి. "అయ్యయ్య, ఈ సంచీ బస్టాండు గేటు కానుకునుండే సిగిరెట్టు బంకులో యియ్యయ్య. అది నా అల్లుడి కొట్టేలే. వాడిపేరు ఆదెయ్య" అన్నాడు.

ఆ పెద్దమనిషి యిబ్బందిగా ముఖంపెట్టి "నువ్వెవరో నాకు తెలియదు. నేనెవరో నీకు తెలియదు. అలాంటప్పుడు ఆ సంచీ నువ్వు నా కివ్వడం, నేను తీసికోవడం రెండూ బాగా లేవు" అన్నాడు కచ్చితంగా. ఆయన కంఠం కూడా గంభీరంగా వుంది.

"ఇందులో బంగారమేమి లేదులే స్వామీ. ఏవో నాలుగు పళ్ళూ, నాలుగు అరిసెలూ దానికి పంపుతున్నాను. వీటిని పట్టుకుపోయి నువ్వేం బాపుకుంటావులేయ్యా. నీ మొహం చూస్తుంటే తెలియడంలా పెద్దమనిషివని. ఇందాక ఆయనెవరో అడిగితే ఆయనకిచ్చానా?"



## మొదటి పాఠం

అయినా పెద్దమనిషి తల అడ్డంగా తిప్పాడు.

ఒక పక్క కండక్టరు లైటైనయి పోతున్న దని గొణుగుతున్నాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఆ పెద్ద మనిషిమీద చాల కోపం వచ్చింది. ఆ మాత్రం సహాయం చేస్తే యితనికి పోయేదేమిటి? మరీ మనిషికి అంత స్వార్థం వుండకూడదు. ఈ పెద్దమనిషేగాని అతని పరిస్థితుల్లో వుంటే కన్న కూతురి గురించి ఈయన మనసు కూడా అంతగా కొట్టుకులాడదా?

బస్సులో మిగిలిన పాసింజర్లు కూడా ఆ పెద్దమనిషికి నచ్చ చెప్పారు.

ఎలాగైతేనేం ఆ పెద్ద మనిషి చివరికి అతని దగ్గర నుంచి ఆ చేతి సంచి తీసి కొన్నాడు. ఆ తర్వాత ఆ మనిషి ఒక కవరు కూడా పెద్దమనిషి చేతికి యిచ్చి, "ఈ వుత్తరం కూడా మా అల్లుడి కియ్యయ్యా" అన్నాడు.

ఆ పెద్దమనిషి గొణుక్కుంటూ అది కూడా తీసికొన్నాడు.

తర్వాత బస్సు కదిలింది. ఆ పెద్దమనిషి అతనికి ఆ సహాయం చేస్తున్నందుకు నాకు కొద్దిగ మనస్సు స్థిమిత పడింది.

అయినా, నా మనసులో ఆ పెద్దమనిషి గురించే ఆలోచనలు చెలరేగుతున్నాయి. ఈ పెద్దమనిషిని చూస్తుంటే, లోకానికంతా సహాయం చేసే మహాత్ముడిలా వున్నాడు. కాని, యితనిలో ఎంత స్వార్థం వుంది! కడుపుతో వున్న కూతురికి అరిసెలు, పళ్ళు పట్టుకెళ్ళి యివ్వమని పాటి మనిషి బతిమాలు తుంటే, యితనికి కనికరమే కలగలేదు. నిజంగా మనిషిలో యింత స్వార్థం వుంటుందా! ఎదుటి మనిషికి చెయ్యగలిగిన సహాయం చేస్తే వచ్చిన నష్టం ఏముంటుంది! పాపపుణ్యాల మీద నమ్మకం లేకపోయినా, మానవత్వమనేది వుండదా?

ఆలోచిస్తూనే, ఆ పెద్దమనిషికేసి అప్పు డప్పుడు చూస్తున్నాను. మరో గంట తర్వాత బస్సు కావలి బస్ స్టాండులో ఆగింది.

అంతసేపు ఓపిగ్గా కూర్చున్నవాళ్ళు బస్సు ఆగగానే ఒకరిమీద ఒకరు పడి దిగుతున్నారు. కాసేపాగి, నెమ్మదిగా దిగితే ఏమవుతుందో? అంతా దిగిన తర్వాత దిగవచ్చని అలాగే కూర్చుని కిటికీలోంచి కిందికి చూశాను.


డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.



వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్రస్ఖలనములక ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు
రావూస్ క్లినిక్,
టి. బి రోడ్, తెనాలి.
ఫోన్ : 3700 & 4010.

ఒక నెల వరకు గొప్ప అవకాశము
రు. 20 మాత్రమే ట్రాన్సిస్టర్
టూ—ఇన్—వన్ లైపు ఆల్ వరల్డ 2 బ్యాండ్ ట్రాన్సిస్టర్ (ఎ.సి./బ్యాటరీ) 83 మోడల్ రు. 180 విలువైనది. అన్ని ఛార్జీలతో చేరి రు. 20 లకు మాయొక్క కో ఆపరేటివ్ చైను లింక్ పద్ధతి ద్వారా పొందండి. ఉచిత షరతులకు వ్రాయండి.
**Kapsons Enterprises Regd (W-15),** Post Box No. 9413, DELH1 - 110051.

ప్రతి బుధవారం
ఆంధ్రపత్రిక దినపత్రికలో
"వివరాల వీధి"
ప్రకటనల కాలమ్‌లో మీ వ్యాపార ప్రకటనలివ్వండి. కాలమ్ సెం మీ. రు. 7 మాత్రమే.
వివరాలకు :
అడ్వర్టయిజుమెంటు మానేజరు,
ఆంధ్రపత్రిక, విజయవాడ-3.

తెలుగులో టైలర్ పుస్తకాలు



ఈనాటి ఫ్యాషన్లతో బెల్‌ప్యాంట్లు, లాకులు 80 జాకెట్లు, 110 షర్టు వగైరా 175 కటింగులు 3 వేల బొమ్మలతో 365 ప్లాన్లు 400 పేజీలు రు. 40 -
ప్రజలు పత్రికా ప్రశంస లందిన 35 రకాలు స్వయంగా కత్తిరించి కుట్టేది 424 పే. 300 చిత్రాలు. రు 40 అడ్వాన్సుగా రు. 5 పంపాలి.
జి పున్నారావు చౌదరి,
మోపర్రు, తెనాలితాలూకా 522312



కింద బెనర్జీ అంకుల్ నవ్వుతూ చెయ్యి వూపారు.

అంకుల్ నల్లకోటులోనే వున్నారు.

అంకుల్‌నిచూడగానే నాకు నా ఆశయాలు, నా ముందు జీవితం అంతా గుర్తుకొచ్చి, ఏదో ఆనందం ముసురుకొంది.

అంతా దిగిన తర్వాత నేను నెమ్మదిగా సూట్‌కేసు తీసికొని దిగాను. అంకుల్ పక్కన నిలబడి వున్న మనిషి నా సూట్‌కేసు అందుకున్నాడు. అతను అంకుల్ కారు డ్రయివరయ్యుంటాడనుకున్నాను.

"కమాన్ బేబీ" అంటూ అంకల్ నా భుజంమీద ఆప్యాయంగా చెయ్యి వేశారు.

డ్రయివర్ ముందు వెళుతోంటే, మేము వెనుక నెమ్మదిగా నడుస్తున్నాము. అంకుల్ డాడీ గురించి అడుగుతుంటే, సమాధానాలు చెబుతూ నడుస్తున్నాను.

గేటు దాటగానే, ప్రక్కన వున్న సిగరెట్టు కొట్టు దగ్గర జనం మూగి వున్నారు. పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి.

అంకుల్‌తో పాటు నేను కూడా అటుకేసి ఆసక్తిగా చూశాను.

బస్సులో నా పక్కన కూర్చుని వచ్చిన పెద్దమనిషిని, ఎవరో నిక్కరు వేసికొని వున్న ఒక అతను చొక్కా పట్టుకొని తిడు తున్నాడు.

"చూడండయ్యా, ఈ పెద్దమనిషి ఏం చేశాడో. మా మామ నాకు ఈ సంచీలో అరిసెలు, పళ్ళతో పాటు ఒక వంద రూపా యలు మైనం కాగితంలో చుట్టిపెట్టి పంపు తున్నట్టు, ఈ పెద్దమనిషి తనకి బాగా తెలిసినవాడనీ రాసిపంపాడు. కాని, ఈ సంచీలో డబ్బు మాత్రం లేదు వీడు మాత్రం తనకు డబ్బు సంగతి తెలియదంటాడు. అసలు మా మామ కూడా తెలియదంటు న్నాడు వీడెవడో తెలియకపోతే ఆయన ఆ సంచీ ఎట్టా యిస్తాడు? కావాలంటే, ఈ వుత్తరం చదవండి." అంటూ కాగితం పక్కన చూస్తున్న వాళ్ళకి అందించాడు నిక్కరతను.

పెద్దమనిషి ఏదో చెబుతున్నాడు.

అయితే, అతని మాటలు ఎవ్వరూ వినడం లేదు.

ఆ నిక్కరు వేసుకున్న మనిషి ఆ సిగ రెట్టు కొట్టతనని అర్థమవుతోంది. అతని పక్కన నలుగురు రౌడీలు సపోర్టుగా మాట్లాడుతున్నారు

"నాలుగు పీకితే వీడే యిస్తాడురా ఆ డబ్బు" అంటున్నాడు ఒక రౌడీ.

ఇంకొక రౌడీ తన్నబోయాడు.

మరో రౌడీ ఆ పెద్దాయన చొక్కా జేబులో చెయ్యిపెట్టి, డబ్బు తీశాడు. ఒక యాభై రూపాయల నోటు, రెండు రూపాయి కాగి తాలు వున్నాయి. ఆ డబ్బు సిగరెట్టు కొట్ట తని చేతికిచ్చి, "ఇదయినా దక్కింది లేరా" అంటున్నాడు ఆ రౌడీ నవ్వుతూ.

నాకు కోపంతో ఒళ్ళంతా మండిపోయింది. "అంకుల్, ఆ పెద్దమనిషికి నిజంగా ఏమీ తెలియదు. అదేదో వూళ్ళో ఒకతను వచ్చి, తన కూతురు కడుపుతో వుందని, ఆ సంచీ యిక్కడ సిగరెట్టు కొట్టులో యివ్వమని బ్రతిమాలితే ఆ పెద్దమనిషి ఒప్పుకున్నాడు పాపం...." అంటూ నేను అటు పక్కకి వెళ్ళబోతుంటే, అంకుల్ నా చెయ్యి పట్టు కొని ఆపి, "టేకిట్ ఈజీ బేబీ ఆ గొడవ విషయం మనకి అనవసరం. పద" అన్నారు.

"ఇదేమిటి అంకుల్, నేను జరిగింది కళ్ళారా చూశాను. చూశాను గనుక నేను అక్కడ నిజం చెప్పి ఆ పెద్దమనిషిని కాపాడు తాను..."

"నువ్వు కళ్లతో చూసి వుండవచ్చు. కాని, చట్టానికి కళ్ళు లేవు. అది సాక్ష్యాలూ, ఆధారాలూ చెబితే వింటుంది. దట్సాల్ ఆ పెద్దమనిషి ఆ సంచీలో వున్న వంద రూపా యలు తీసికోలేదని నీకెలా తెలుసు ?" సూటిగా అడిగాడు అంకుల్.

"నేను బస్సు దిగుతున్నంత సేపూ అతను నా పక్కనే వున్నాడు."

"వుండవచ్చు. కాని, అంతసేపూ అతను ఏం చేస్తున్నదీ నువ్వు గమనించావన్న నమ్మకం ఏమిటి? అయినా, నీకు గమనించ వలసిన అవసరం ఏమిటి? దొంగతనం చేసే వాడు ఎవ్వడూ చూడకుండా సమయం కని పెట్టేగదా తీస్తాడు? ఒకవేళ అతను బస్సులో తియ్యకపోయినా, బస్సు దిగిన తర్వాత తీసి వుండవచ్చు గదా?"


"బట్ అంకుల్... ఆ సంచీలో డబ్బు నిజంగా వున్నా ఆ విషయం అతనికి తెలియదు గదా?"

"ఇటీజ్ వెరీ సింపుల్. ఆ సంచీలో ఏముందో చూద్దామనే కుతూహలంతో చూసి వుండవచ్చు అప్పుడు డబ్బు కనిపించి వుండ వచ్చు"

"మరి డబ్బుని ముక్కూ ముఖం తెలియని పెద్దమనిషిచేత పంపడం..."

"ఆ వుత్తరంలో పెద్దమనిషి తనకు తెలిసినట్టు రాశాడు ఆ మోసం చేసినవాడు" అంటూ నవ్వారు అంకుల్

"మరి తెలిసిన మనిషి చేత సంచీలో అంత నిర్లక్ష్యంగా డబ్బు పెట్టడం దేనికి?



## మొదటి పాఠం

ఆ వంద రూపాయలు ఆ పెద్దమనిషి చేతికే యివ్వవచ్చుగా?''

''పెద్దమనిషి మీద నమ్మకం కొద్దీ, అతను సంచీలో వస్తువులు తాకడనే వుద్దేశ్యం కొద్దీ అతను సంచీలోనే డబ్బు పెట్టానంటాడు.''

నేను తల విదిలించాను. ''అంకుల్.... పెద్ద మనిషేగాని ఆ డబ్బు దొంగిలించి వుంటే, ఆ సంచీకూడా యివ్వకుండా వెళ్ళవచ్చుగా?'' అడిగాను అసహనంగా.

''నో. సంచీ యిచ్చినవాడికి పెద్దమనిషి తెలుసని ఆ వుత్తరంలో వున్న విషయం నువ్వు మరిచిపోతున్నావు. అసలు సంచీయే యివ్వకుండా వెళ్తే, సంచీతోపాటు డబ్బు కూడా ఈ పెద్దమనిషే దొంగిలించినట్లు తర్వాతయినా ఆ మోసగాడికి తెలుస్తుంది గదా? అందువల్ల సంచీ యిచ్చి వుంటాడు.''

''ఒకవేళ పెద్దమనిషేగాని వంద రూపాయలు దొంగిలించి వుంటే, ఆ పెద్దమనిషి జేబులో ఆ వంద రూపాయలు వుండాలిగదా? కాని, అతని జేబులోంచి యాభై రెండు రూపాయలే గదా వాళ్ళు తీసింది?''

''ఆ వంద యింకెక్కడయినా దాచి వుంచవచ్చు. లేదా యింకెవరికైనా యిచ్చి వుండవచ్చు...''

''నో అంకుల్. నో...''

''నువ్వు చెప్పింది నిజమే నమ్మా. ఆ పెద్దమనిషి ఆ వందరూపాయలు తియ్యలేదని, అసలు ఆ సంచీలో వంద రూపాయలు లేవనీ— నీకు, నాకు, ఆ పెద్ద మనిషికి, ఆ పెద్దమనిషికి సంచీ యిచ్చిన మోసగాడికి, ఆ సిగరెట్టుకొట్టు వాడికీ, వాడి ప్రక్కనున్న రౌడీలకీ, చుట్టూవున్న జనానికీ — అందరికీ తెలుసు. ఇది ఒకవిధమైన దొంగతనం. చిన్న నాటకంతో ఆ పెద్దమనిషిని మోసం చేసి యాభై రెండు రూపాయలు రాబట్టారు.'' అన్నారు అంకుల్ నవ్వుతూ.

ఆ పెద్దమనిషి తలవంచుకొనిపోతున్నాడు.

ఆ సిగరెట్టు కొట్టువాడు, రౌడీలతో కలిసి నవ్వుతున్నాడు.

బస్సులో పైనా చొక్కాకూడా లేని పేదవాడు ఆ సంచీ తను అందజేస్తానంటే, 'ఆ సంచీలో ఏ బంగారమూ లేదన్న' ఆ మోసగాడు ఆసంచీని ఆ పేదవాడికి ఎందుకు యివ్వనన్నాడో, ఎంత కాదన్నా యీ పెద్దమనిషికే ఎందుకు ఆ సంచీని అంటకట్టాడో యిప్పుడు అర్థమవుతోంది అవును. వీళ్ళ నాటకంలో పాల్గొనడానికి ఆ పేదవాడి దగ్గర డబ్బులేదుగా? ఆ పేదవాడిని చివరిలో యిలా బెదిరించినా, కొట్టినా, అతని దగ్గర ఏమీ రాలవని ఆ మోసగాడికి తెలుసు. ఈ పెద్దమనిషి నాలుగు డబ్బులున్న వాడిలా కనిపించాడు. అందుకే ఆ మోసగాడు తన నాటకంలో పాత్రకి యీ పెద్దమనిషిని ఎన్నుకున్నాడు. అనుకున్నట్లే సాధించాడు కూడా.

అలాగే ఆ పెద్దమనిషికూడా మంచి అనుభవం వున్నవాడే. అందుకనే, మొదట ఆయన సంచీ తీసుకోడానికి ఒప్పుకోలేదు. కానీ, అందరి బలవంతవల్ల అనుభవాన్ని అవతలకి నెట్టి, యాభై రెండు రూపాయలతో మరో 'అనుభవాన్ని' కొనుక్కున్నాడు.

బాధతో నాగుండె నలిగిపోతోంది. జరిగిన మోసాన్ని నాచేతనైనంత వరకు అడ్డుకోలేనందుకు ఏదో తప్పుచేసిన దానిలా ఫీలయ్యాను.

''కాని, అంకుల్, ఇంవాక నేను జరిగిందంతా వాళ్ళకి చెప్పి వుంటే ఏమయినా ఫలితం వుండేదేమో...'' అన్నాను బాధగా.

''నో. ఫలితం లేకపోగా, నిన్నుచూసి మరో వందమంది చుట్టూ పోగయ్యేవాళ్ళు. చూడు బేబీ, నువ్వు యింత చిన్న మోసానికే అంత కలవరపడిపోతే న్యాయవాదిగా రాణించలేవు. ఫరెగెట్ ఎవ్విరిథింగ్. అంతేకాదు. ఇదే కేసు రేపు కోర్టుకు వచ్చి, ఆ సిగరెట్టుకొట్టు వాడే తన తరుపున వాదించమని నిన్ను అడిగితే- నువ్వు కళ్ళతో చూసినదంతా మరచిపోయి— ఆ సిగరెట్టు కొట్టు వాడిదే నిజమనీ, ఆ పెద్ద మనిషే ఆ వంద రూపాయలు కొట్టేశాడని వాదించి కేసు గెలవ గలగాలి. అప్పుడే నువ్వుమంచిలాయర్‌గా పేరు తెచ్చుకుంటావు. ఇది నా జూనియర్‌గా నీకు నేను చెప్పే మొదటి పాఠం.'' అన్నారు అంకుల్ కారు ఎక్కుతూ.

నేను కారులో ఎలా కూర్చున్నానో, కారు ఎప్పుడు స్టార్టయిందో నాకు తెలియలేదు. ★

## కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥